ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

సోమవారం 28 జూలై 2025

21.55 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్

విజయనగరం కలెక్టరేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ఎరువుల షాపులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీటీ రామారావు ఆధ్వర్యంలో ఆదివారం సిబ్బంది తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 21.55 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీటిని సీజ్ చేశారు. వీటి విలువ రూ.3,74,588 ఉంటుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ఎరువులు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 8331056279 నెంబరుకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ఎవరైనా డీలరు ఎంఆర్‌పీ మించి అమ్మితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముందుచూపు ముఖ్యం





మానవ శరీరంలో జరిగే జీవ క్రియలో పాలుపంచుకునే ప్రధాన అవయవం లివర్ (కాలేయం)కు నిర్లక్ష్యం వల్ల కాని, ముందు జాగ్రత్తలు తీసుకోక కాని హెపటైటీస్ సమస్యలు వస్తుంటాయి. ఇన్‌ఫెక్షన్లు, ఆల్కహాల్ అలవాటు, జన్యుపరమైన లోపాలు, కొన్ని రకాలైన మందులను తీసుకోవడం వల్ల కూడా హెపటైటీస్ సంక్రమిస్తుంది. జిల్లాలో ఈ ఏడాది జూలై వరకూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 4,320 కేసులు నమోదైనట్టు వైద్యులు చెబుతున్నారు. ముందు చూపు కీలకమని, అవగాహన చేసుకుంటే మెరుగైన వైద్యం ఉందని వైద్యులు తెలిపారు.

- అవగాహనతో హెపటైటీస్‌కు దూరం
- నిర్లక్ష్యం చేస్తే లివర్‌కు అపాయం
- జిల్లాలో పెరుగుతున్న ఈ తరహా కేసులు
- సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యం
- ముందస్తు వ్యాక్సినేషన్‌తో చెక్
- నేడు ప్రపంచ హెపటైటీస్ దినం

విజయనగరం రింగురోడ్డు, జూలై 27 (ఆంధ్రజ్యోతి)

వైరస్ వల్ల సంక్రమించే హెపటైటీస్ కాస్త ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధులను ఏ,బీ,సీ,డీ,ఈగా వర్గీకరించారు. ఇవి ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంటాయి. జిల్లాలో హెపటైటీస్ బీ,సీ వైరస్ సోకిన రోగులు ఎక్కువ. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఈ రోగులకు పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు. ఔషధాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

● **హెపటైటీస్-ఏ:** కలుషితమైన ఆహారం, నీటి ద్వారా వ్యాపిస్తుంది. ఇది ఎక్కువగా పిల్లల్లో కన్పిస్తుంది. సాధారణంగా కొద్ది రోజుల్లో నయం అవుతుంది.

● **హెపటైటీస్-బీ:** రక్తమార్పిడి, కలుషిత సూదులు, సిరంజీలు, టాటూలు, టూత్ బ్రెష్‌లు వంటి వ్యక్తిగత వస్తువులను పంచుకోవడం వల్ల వస్తుంది. జనన సమయంలో తల్లి నుంచి బిడ్డకు వ్యాపిస్తుంది. హెపటైటీస్-బీ ఒక్కోసారి **(మిగతా 8వ పేజీలో..)**



ఆంధ్ర జలాశయం నీటిని విడుదల చేస్తున్న మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి

ఆంధ్ర రిజర్వాయర్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం

- మంత్రి శ్రీనివాస్ ● హామీలన్నీ అమలు చేస్తున్నాం: మంత్రి సంధ్యారాణి
- జలాశయం నీటి విడుదల కార్యక్రమానికి హాజరు

మెంటాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎంతో ఘన చరిత్ర ఉన్న ఆంధ్ర రిజర్వాయర్‌ను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, దీనికి పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్ర జలాశయం నీటిని ఆయన మంత్రి సంధ్యారాణితో కలిసి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని టూరిస్టు హబ్‌గా మారుస్తామని, అందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగం చిన్నాభిన్నమై వ్యవసాయమే సంక్షోభంలోకి వెళ్లి రైతులు ఇబ్బందులు పడ్డారనేందుకు ఆంధ్ర రిజర్వాయర్ దుస్థితే రుజువని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకున్న అపార అనుభవంతో ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నారని అన్నారు. ఆంధ్ర రిజర్వాయర్ అభివృద్ధికి రెండున్నర కోట్ల రూపాయలు విడుదల చేశామని, వాటిలో ఇప్పటికే కోటిన్నరతో పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే జలాశయంలో చేపపిల్లలు వదిలి మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తామని సంధ్యారాణి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు కె.సతీస్, టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, నాయకులు గెద్ద అన్నవరం, రెడ్డి ఆదినారాయణ, మాజీ జడ్పీటీసీ శ్రీధర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రాజాంకు ఎన్నికలు సాధ్యమేనా?



రాజాం మునిసిపల్ కార్యాలయ భవనం

- ఆర్థిక సంఘం నిధుల నిలిపివేతతో ప్రభుత్వం దృష్టి
- మునిసిపాల్టీలకు మరో ఏడు నెలల్లో ఎన్నికలు
- వాటితో కలిసి నిర్వహించే అవకాశం

రాజాం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపాల్టీకి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమా చారం. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కారణాలతో చాలా మునిసిపాల్టీలకు, నగరాలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో అక్కడ పాలకవర్గాలు లేక పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రాజ్యాంగపరంగా రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. ప్రత్యేక నిధుల కేటాయింపు కూడా నిలిచిపోయింది. దీంతో అక్కడ సరైన అభివృద్ధి లేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగా రాజాం మునిసిపాల్టీకి సైతం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధపడినట్టు తెలుస్తోంది. ఇటీవల మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ సైతం దీనిపై ప్రకటన చేశారు. ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయిన దృష్ట్యా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మూడు నెలల్లో ఎన్నికలు పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. రాజాం మునిసిపాల్టీకి ఎన్నికలు జరిగితే 20 ఏళ్ల తరువాత పాలకవర్గం వచ్చినట్టు అవుతుంది.

రాజాం ఎప్పటి నుంచి ఇలా..

రాజాం నగర పంచాయతీగా 2005లో రూపాంతరం చెందింది. అంతవరకు సారధి మేజర్ పంచాయతీలో భాగంగా ఉండేది. సారధిలో పొనుగటివలస, కొత్తవలస, కొండంపేటలను విలీనం చేస్తూ రాజాం నగర పంచాయతీని ఏర్పాటుచేశారు. అయితే న్యాయస్థానంలో కేసుల దృష్ట్యా ఎన్నికలు సాధ్యపడలేదు. రెండు దశాబ్దాలుగా పాలకవర్గాలు లేవు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ప్రత్యేకాధికారుల ఏలుబడిలోనే కొనసాగుతోంది. ఆ మూడు పంచాయతీలకు సంబంధించి పాలకవర్గాలు ఉండగానే 2005లో ప్రత్యేక తీర్మానం చేసి నగర పంచాయతీలో విలీనం చేశారు. దీంతో ఆయా సర్పంచులు కోర్టుకు వెళ్లారు. అప్పటి నుంచి కేసులు నడుస్తూ ఉన్నాయి. నాలుగేళ్ల కిందట వైసీపీ హయాంలోనే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎన్నికల కోసం ప్రత్యేక తీర్మానాలు చేయించారు. ప్రత్యేకాధికారులను నియమించి ఆ తతంగం పూర్తి చేశారు. 2021లో మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ చేసి ఎన్నికలకు సిద్ధపడ్డారు. మరోసారి పొనుగుటివలస, కొండంపేట, కొత్తపేట పంచాయతీలు విలీన ప్రక్రియతో ఉపాధి హామీ పథకం నిలిచిపోతుందని.. పన్నుల భారంతో సతమతమవుతామని చెప్పి మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. కోర్టు స్టే ఇవ్వడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. అక్కడి నుంచి ఎన్నికల జోలికి వెళ్లడం లేదు. అయితే 20 ఏళ్లుగా పాలకవర్గం లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్ పడింది. ప్రత్యామ్నాయ రూపంలో నిధులు తెచ్చుకోవడం తప్ప. నేరుగా వచ్చిన దాఖలాలు లేవు.

మిగతా వాటితో కలిపే ఎన్నికలు..

రాజాం మునిసిపాల్టీకి ఇప్పట్లో **(మిగతా 8వ పేజీలో..)**





ఉచిత బస్సు ప్రయాణానికి
వడివడిగా అడుగులు

- మహిళలకు ఊరట
- ఆగస్టు 15 నుంచి అమలుకు చర్యలు
- ప్రతిపాదనలు పంపిన జిల్లా అధికారులు
- కొత్త బస్సులు అవసరమని నివేదికలు
- నెలాఖరుకు మార్గదర్శకాలు వచ్చే అవకాశం

● మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణానికి సంబంధించి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15 నుంచి అమలు చేసి తీరుతాం. అందుకు అవసరమైన కసరత్తు చేస్తున్నాం. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ కనుక అమలు చేస్తాం.

-సీఎం చంద్రబాబు ఇటీవల చేసిన ప్రకటన ఇది.

● ఏపీఎస్‌ఆర్టీసీ బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రయాణికులకు సంబంధించి మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. కొత్త బస్సుల ఏర్పాటుతో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, బస్టాండ్లను ఆధునీకరిస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి అన్ని జిల్లాల్లో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

-జిల్లా పర్యటనకు ఇటీవల వచ్చిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చేసిన ప్రకటన ఇది.


విజయనగరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆగస్టు 15 నుంచి ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిపోల వారీగా ఉన్న బస్సులు, వాటి సామర్థ్యం, రూట్ల వారీగా ప్రయాణికుల రద్దీ, మహిళా ప్రయాణికులపై అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ఇప్పటికే అందజేశారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, ఎస్.కోట, సాలూరు, పాలకొండలో ఆర్టీసీ డిపోల్లో 450 బస్సులు ఉన్నాయి. ప్రతిరోజూ 1.5 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తుంటాయి. రోజుకు సగటున 95 వేల మంది ప్రయాణం చేస్తున్నారు. అందులో మహిళలు 37 వేల మంది వరకూ ఉన్నారు. ఉమ్మడి జిల్లాను ప్రామాణికంగా చేసుకుని మహిళలకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లతో పాటు సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విజయనగరం జిల్లాకు 179 సర్వీసులు నడుస్తున్నాయి. మరో 11 బస్సులు ఇటీవల కొత్తగా వచ్చాయి. మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి మరో 20 బస్సులు అవసరం అవుతాయి. అలాగే మన్యం జిల్లాకు సంబంధించి మరో 40 బస్సుల వరకూ అవసరం ఉంటుందని సంబంధిత అధికారులు ప్రభుత్వానికి తెలియజేశారు.

వసతులు మెరుగుపరిస్తేనే..

వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసింది. కాంప్లెక్స్‌లు, బస్టాండ్లను కనీసం అభివృద్ధి చేయలేదు. ఇప్పటికీ చాలా బస్టాండ్లు, కాంప్లెక్స్‌ల్లో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం లేదు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేవు. వృద్ధులు, దివ్యాంగులను బస్సుల వద్దకు తీసుకెళ్లేందుకు అవసరమైన వీల్ చైర్లు లేవు. ప్లాట్‌ఫామ్‌లు కూడా శిథిలమయ్యాయి. 2020లో కరోనా పేరు చెప్పి జగన్ సర్కారు చాలా రూట్లలో బస్సులను రద్దుచేసింది. తరువాత వాటిని పునరుద్ధరించలేదు. రోడ్లు బాగాలేవని చెప్పి మరికొన్ని రూట్లలో సైతం బస్సులు నడపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లకు మరమ్మతులు చేపట్టింది. అంతర్రాష్ట్ర, జిల్లా రహదారుల్లో గోతులను పూడ్చింది. ఇంకా చాలా రహదారులు అధ్వానంగానే ఉన్నాయి. ఈ సమస్యలను **(మిగతా 8వ పేజీలో..)**

కౌలు రైతుకు రుణాలేవి?



- జిల్లా వ్యాప్తంగా 16 వేల మంది అర్హులు
- రూ.140 కోట్లు మంజూరు చేయాలని లక్ష్యం
- ఇప్పటి వరకూ రూ.72 లక్షలే అందజేత

కౌలు రైతులకు రుణాలు అందడం లేదు. అధికారుల లక్ష్యం ఒకలా.. బ్యాంకర్ల స్పందన మరోలా ఉంది. జిల్లా వ్యాప్తంగా ఈసారి రూ 140 కోట్ల రుణాలను అందించాలని జిల్లా అధికారులు నిర్దేశించారు. ఖరీఫ్ సీజన్ మొదలై రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ రూ.72 లక్షలే మంజూరు చేసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అధికారులు ఎన్ని ఆదేశాలు జారీ చేస్తున్నా ఆచరణలో ముందడుగు పడడం లేదు.

విజయనగరం కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి)

అర్హులైన ప్రతికౌలు రైతుకూ రుణాలు అందించాలని ప్రభుత్వం చెబుతోంది. ఇదే విషయమై ఇటీవల బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్ కూడా ఆదేశించారు. అయినా వారికి రుణాల మంజూరులో బ్యాంకర్లు ముందడుగు వేయడం లేదు. ప్రతి ఏడాదీ కౌలు రైతులకు రుణాల విషయంలో నిరాశే ఎదురవుతోంది. జిల్లాలో ఈ ఏడాది 16,250 మంది రైతులకు సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు)లు అందజేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిల్లో సర్వేనెంబర్ల ద్వారా 8326 మందికి, ఎల్‌పీఎం ద్వారా 4318 మందికి రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకూ 12644 మందికి కార్డులు పంపిణీ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఏపీ పంటల సాగు హక్కు చట్టం-2019 సెక్షన్ 5(బి) ప్రకారం పంట రుణాలు పొందడం, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం పొందడానికి కౌలు కార్డులను వినియోగించుకోవచ్చని నిబంధనలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయికి వచ్చేసరికి బ్యాంకుల నుంచి అనుకున్న స్థాయిలో రుణాలు అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈసారి రూ.140 కోట్ల రుణాలను అందించాలని **(మిగతా 8వ పేజీలో..)**

కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు

8లో

- దేశ సంపదను దోచిపెడుతున్నారు
- పాలక పార్టీలకు అడ్డుకట్ట వేయాలి
- సీపీఐ జిల్లా మహాసభల్లో రెండో రోజు వక్తల పిలుపు



సీపీఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర నేతలు

టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కళా వెంకటరావు

గుర్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. జమ్ము గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ జమ్ము త్రినాథ, సొసైటీ డైరక్టర్ జమ్ము వెంకటరావు, వార్డు మెంబరు జమ్ము సురేష్, కురిమెల్ల మధుబాబు తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చనమల మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ వెన్నె సన్యాసినాయుడు, టీడీపీ గ్రామ నాయకుడు జమ్ము గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అద్దెలు రద్దు చేయాలి

విజయనగరం దాసన్నపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో రైతు బజారు ఏర్పాటు చేసే వరకూ అద్దెలు రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మహారాజా ఆసుపత్రి రైతుబజారు ఎత్తివేసి రింగురోడ్డు వద్ద ఉన్న దాసన్నపేట రైతు బజారులో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ రైతు బజారును ఆయన ఆదివారం సందర్శించారు. తక్షణమే శాశ్వత రైతుబజారును పాత టూటౌన్ పోలీసుస్టేషన్ వద్ద ఏర్పాటు చేసి ఇవ్వాలని, అప్పటి వరకూ అద్దెలు రద్దు చేయాలని కోరారు. మొత్తం 46 మందికి కేవలం 16 మందికి మాత్రమే షెడ్లు ఇచ్చారని, మిగతా 30 మందికి షెడ్లు ఇవ్వలేదని.. వీరికి కూడా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అమ్మవారికి తాళిబొట్టు కానుక

చీపురుపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి పేరిపి గ్రామానికి చెందిన గవర సతీష్‌కుమార్ బంగారు తాళిబొట్టు కానుకగా సమర్పించారు. సుమారు రూ.45వేలు విలువ చేసే ఈ ఆభరణాన్ని ఆయన ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్, కమిటీ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకం

రాజాం రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకమని ప్రముఖ రంగస్థల కళాకారుడు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు అన్నారు. రాజాం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని రాజాంలోని తృప్తి రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఆయన తోపాటు జీఎంఆర్ వరలక్ష్మి కేర్ హాస్పిటల్ మెడికల్ డైరక్టర్ డా.దామెర రాజేంద్ర, రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు. రాజాం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పెంకి వెంకటరావు, కరణం సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, ట్రెజరర్ పాలవర్తి గణేష్ పాల్గొన్నారు.

రేపు రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాక

విజయనగరం కలెక్టరేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఈనెల 29న ఉదయం జిల్లాకు రానున్నట్లు జిల్లా కార్యవర్గం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక రెవెన్యూ హోంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఏపీజేఏసీ అమరావతి జిల్లా సమావేశం, మధ్యాహ్నం 3 గంటలకు రెవెన్యూ కార్యవర్గ సభ్యులతో సమావేశం జరగనున్నదని చెప్పారు. ఈ సమావేశానికి జిల్లాలో ఉన్న తహసీల్దార్లు హాజరు కావాలని కోరారు.

నేడు మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్

విజయనగరం కలెక్టరేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

రాజాం రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా భాగస్వామ్యంతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ఉత్తరాంధ్ర అభివృద్ధి కమిటీ కన్వీనర్ అజాశర్మ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాజాంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాట-శాస్త్రీయ పరిశీలన అనే అంశంపై మాట్లాడారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధ్యక్షుడు వెంకటరావు, డివిజన్ కార్యదర్శి గొర్లె రమేష్, జిల్లా కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

యూరియా సిద్ధం

భోగాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రస్తుతం 58 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందని మండల వ్యవసాయ అధికారిణి కె.హైమావతి తెలిపారు. భోగాపురంలోని ఎరువుల దుకాణాన్ని ఆమె ఆదివారం తనిఖీ చేశారు. ప్రైవేటు డీలర్ల వద్ద 22 మెట్రిక్ టన్నులు, సొసైటీల్లో 32 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు.

చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు

- అక్రమంగా తరలిపోతున్న మట్టి
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

నెల్లిమర్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): చెరువుల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పట్టపగలే అక్రమంగా మట్టిని తరలించుకుపోతున్నారు. ఇళ్ల నిర్మాణానికి, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ చెరువుల్లో మట్టి తరలించకూడదని కఠిన నిబంధనలు ఉన్నాయి. కేవలం ఉపాధి పనుల్లో భాగంగా వేతనదారులు మట్టిని తవ్వవచ్చు. ఆ తవ్విన మట్టిని కూడా చెరువు గట్టుపైన మాత్రమే వేయాలి. కానీ కొందరు అక్రమార్కులు పట్టపగలే చెరువుల్లో యంత్రాలతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఇందుకు సంబంధించి గ్రామ రెవెన్యూ అధికారికి పలువురు సమాచారం ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తమ దృష్టికి వచ్చిన వాటిపై చర్యలు తీసుకుంటున్నాం. అక్రమంగా మట్టిని తరలించినవారిపై కఠిన చర్యలు తప్పవు.

- శ్రీకాంత్, తహసీల్దార్, నెల్లిమర్ల



చెరువుల్లో మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

అశోక్‌ను గోవా గవర్నర్‌గా నియమించడంపై హర్షం

- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తున్నారు

విజయనగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి పట్ల అంకితభావంతో పనిచేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలో ఆయన ఆదివారం మాట్లాడారు. అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించటం ఈ ప్రాంత ప్రజల, ప్రజాప్రతినిధుల అభివృద్ధి పట్ల అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. విశాఖపట్టణంలో టీసీఎస్, కాగ్నిజెంట్, ఫోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి బాటలు పడుతున్నాయన్నారు.

రుణపడి ఉంటాం

విజయనగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ ప్రాంత ప్రజలు ఎంతో రుణపడి ఉంటారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల కోసం కొట్లాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టటమే కాకుండా అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించటం పట్ల ఇక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

గొప్ప విషయం

ఎస్.కోట రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ ప్రాంత ప్రజలు ఎంతో రుణపడి ఉంటారని టూరిజం బోర్డు కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి సుధారాణి అన్నారు. ఆదివారం ఎస్.కోటలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం ఎంతో మానసిక క్షోభకు గురిచేసిన కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజుకు ప్రస్తుత ప్రభుత్వం గవర్నర్ పదవి కేటాయించడం గొప్ప విషయం అన్నారు. ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోష్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రపై ప్రత్యేక అభిమానం

చీపురుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుకు ఉత్తరాంధ్ర ప్రాంతంపైన, ఇక్కడున్న నాయకులపైన ప్రత్యేక అభిమానమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవిని ఇచ్చి, ఈ ప్రాంతంపై, ఇక్కడి నాయకులపైన ఉన్న అభిమానాన్ని నిరూపించారన్నారు. అదే విధంగా ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధిపై కూడా చంద్రబాబుకు ప్రత్యేక దృష్టి ఉందన్నారు.

నాయకులకు ప్రోత్సాహం

భోగాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలోనే కాదు నాయకులను ప్రోత్సహించడంలోనూ టీడీపీ ముందు ఉంటుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి దక్కడం ఉత్తరాంధ్రకే గర్వకారణమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి పిడుగు తాతారావు, పార్లమెంటు తెలుగు యువత కార్య నిర్వాహణ కార్యదర్శి కర్రోతు రాజు పాల్గొన్నారు.

ప్రోత్సాహంలో ముందంజ

రాజాం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలో కాదు ఇక్కడ నాయకులను ప్రోత్సహించడంలో కూడా టీడీపీ ముందుంటుందన్న విషయం మరోసారి స్పష్టమైందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొల్ల అప్పలనాయుడు అన్నారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అశోక్‌కు గవర్నర్ పదవి రావడం గర్వకారణమన్నారు.

సహకార రంగం పునరుజ్జీవానికి కృషి

- మంత్రి సంధ్యారాణి



సొసైటీ అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి

మెంటాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సహకార రంగం పునరుజ్జీవానికి కట్టుబడి ఉందని మంత్రి సంధ్యారాణి అన్నారు. ఆదివారం మెంటాడ, మక్కువ పీఏసీఎస్ అధ్యక్షులు జి.ముసలినాయుడు, అర్నిపల్లి సత్యంతో పాటు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం కో ఆపరేటివ్ సెక్టార్‌ను నాశనం చేసిందని విమర్శించారు. కొత్త పాలకవర్గాలు రైతుల అభ్యున్నతికి పాటుపడుతూ సొసైటీలకు అభివృద్ధి పథంలో నిలపాలని ఆమె సూచించారు. అనంతరం జక్కువలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రూ.2.40 కోట్లతో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే నాగమాధవి



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నెల్లిమర్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో రూ.2.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. ఏడో వార్డు చందక వీధిలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆమె ఆదివారం భూమిపూజ చేశారు. వార్డు కౌన్సిలర్ బీజేపీ నాయకుడు మైపాడు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పంచాయతీలో సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. వీఎంఆర్‌డీఏ నిధులు రూ.2.40 కోట్లతో ఈ పనులు చేపడుతున్నామని ఆమె వివరించారు. అభివృద్ధి పనుల విషయంలో కౌన్సిలర్ల ప్రోత్సాహం అవసరమన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, గంట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల సాధికారత సాధనే లక్ష్యం

- మంత్రి శ్రీనివాస్



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన పోరులో బంగారు కుటుంబాల సాధికారత సాధనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొనిస గ్రామంలో ఆయన పర్యటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 68 లక్షల 50వేల మందికి ప్రతినెల రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యానికి సన్నాహాలు చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి పనులు చేపట్టామని, జిల్లాలో ఇప్పటికే మూడు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని చెప్పారు. మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, నాయకులు శీరం రెడ్డి రామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

అశోక్ స్థానాన్ని భర్తీ చేయలేం

మెంటాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పూసపాటి అశోక్ గజపతిరాజు స్థానాన్ని భర్తీ చేయడం అంత సులువు కాదని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మెంటాడలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆయన టీడీపీకి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన వారసుడు ఎవరనే చర్చ జరుగుతోందని, అయితే పార్టీని ఆ స్థాయిలో నడిపిన నాయకున్ని ఊహించుకోవడం కష్టమని అన్నారు. జిల్లాలో సీనియర్ నేతలు ఉన్నారని, అధిష్ఠానం అన్నీ ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో మంత్రులు శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి సభాముఖంగా అశోక్‌కు అభినందనలు తెలిపారు. ఆయన వర్తమాన, భవిష్యత్ తరాల నాయకులకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు.

జిందాల్ వివాదానికి ముగింపు పలుకుతాం

జిందాల్ వివాదాన్ని సామరస్యంగా పరిష్కారించి ముగింపు పలికేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కొంతమంది రైతులు సమస్య పరిష్కారానికి సహకరిస్తున్నారని తెలిపారు. మరికొందరు రైతులు వారు చెబుతున్న భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు అందజేస్తే వారికి కూడా యాజమాన్యం పరిహారం చెల్లింపునకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రైతులు, శ్రామికుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. వివాదాన్ని వీలైనంత త్వరగా సుఖాంతం చేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు.

ఎవరో వస్తారని ఎదురు చూడకుండా..

- కలిసికట్టుగా రహదారి నిర్మించుకున్న భూపాలపురం రైతులు



రోడ్డు ఏర్పాటు చేసుకుంటున్న భూపాలపురం రైతులు

గుర్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా భూపాలపురం గ్రామ రైతులు తమ పంట పొలాలకు స్వచ్ఛందంగా రహదారి ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలోని రైతులందరూ చందాలు వేసుకుని మొత్తం రూ.13లక్షలు సమకూర్చుకున్నారు. రహదారి నిర్మాణానికి గాను మిగులు భూముల కొనుగోలుకు రూ.10లక్షలు వినియోగించారు. మిగతా రూ.3లక్షలతో రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. ఇరువైపులా మట్టివేసి బాగుచేసుకున్నారు. సుమారు 20 కుటుంబాల రైతులు కలిసికట్టుగా రహదారిని నిర్మించుకున్నారు. దీంతో సుమారు 200 ఎకరాల విస్తీర్ణం గల మెట్టు భూములకు రహదారి సౌకర్యం కలిగింది. ఈ రహదారికి తిత్రి రోడ్డుగా పేరు ఉంది. గతంలో ఈ రహదారి సమస్యను ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని రైతులు వాపోయారు.

రోడ్డు బాగుచేసుకున్న విద్యార్థులు

రేగిడి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం- ఖండ్యాం రూట్‌కు ఇటీవల ఆర్టీసీ బస్సు పునరుద్ధరించారు. దీంతో ఈ రోడ్డు కాస్త పాడయ్యింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా మారింది. దీంతో ఈ రూట్లో బస్సు నడిపేందుకు కష్టసాధ్యంగా మారింది. అధికారులు ఎవరూ స్పందించకపోవడంతో గ్రామస్థులు, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, రోడ్డును బాగు చేసుకున్నారు. విరాళాలు సేకరించి వెట్‌మిక్స్, కంకర తెప్పించి గంతలు కప్పారు.



రోడ్డుకు బాగుచేసుకుంటున్న విద్యార్థులు

రౌండ్ టేబుల్ సమావేశం నిలుపుదల

శృంగవరపుకోట రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిందాల్ ఉద్యమం, ఎంఎస్ఎంఈ పార్కుల ఆవశ్యకత వంటి అంశాలపై పలు రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు, మేధావులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ఎంపీపీ ప్రత్యేక గదిలో ఎంపీపీ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని అర్థాంతరంగా నిలిపేశారు. సమావేశం ప్రారంభమైన అరగంట వ్యవధిలో ఎంపీడీవో సతీష్.. ఎంపీపీ గదికి చేరుకుని సమావేశం నిలిపివేయాలని కోరారు. తనకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని.. ఐదు నిమిషాల్లో సమావేశం ఆపకపోతే తనపై చర్యలు ఉంటాయని తెలిపారు. దీంతో అక్కడ ఉన్న వివిధ రాజకీయపక్ష నేతలు, మేధావులు మాట్లాడుతూ సమస్యలపై సమావేశమైతే ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. అయితే ఎంపీడీవో పదేపదే కోరడంతో సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఇతర నేతలు.. అధికారులను ఇబ్బంది పెట్టడం సరికాదని వెనుదిరిగారు. ఇదే సమయంలో సీపీఎం నేత చల్లా జగన్ కార్యాలయం ముందు బైఠాయించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు ఇలా జిందాల్ కోసం పనిచేయడం బాధ కలిగిస్తుందన్నారు.



సమావేశం ఆపేయాలని ఎంపీపీని కోరుతున్న ఎంపీడీవో

- ఈసందర్భంగా ఎంపీపీ సోమేశ్వరరావు మాట్లాడుతూ.. తాను దళిత ఎంపీపీ కావడమే శాపమా.. అన్నారు. రాజ్యాంగ పరంగా వచ్చిన హక్కులను హరించే అధికారం అధికారులకు లేదన్నారు.

తెలిస్తే.. ముఖ్యమంత్రే పరిష్కరించేవారు

ఎస్.కోట రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు జిందాల్ నిర్వాసితుల సమస్య పూర్తిగా తెలిసి ఉండదని, లేదంటే ఆయనే స్వయంగా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి, సమస్యను ఈపాటికే పరిష్కరించేవారని హైకోర్టు న్యాయవాది అల్లు వెంకటకేశవ జోగినాయుడు అన్నారు. ఆదివారం రాత్రి ఆయన జిందాల్ నిర్వాసితులను కలిసి, మాట్లాడారు. రైతుల ఆందోళనలు జిందాల్ యాజమానికి తెలిసి ఉండవన్నారు. తెలిస్తే కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సీపీఎం నేత చల్లా జగన్, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి..

- బైకు బోల్తా.. ఇద్దరికి గాయాలు

రేగిడి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాపురం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాల పాలయ్యారు. రేగిడి 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొండ మండలం మంగళాపురం గ్రామానికి చెందిన మడపాల సాయి, సంతకవిటి మండలం మండాకురిటి గ్రామానికి చెందిన కేతుబరికి యోగేష్‌లు స్నేహితులు. వీరు ఇద్దరు రేగిడి మండలం కొమిరి వెంకటాపురం గ్రామంలో ఉన్న మరో మిత్రుడు వద్దకు బైకుపై వెళ్లే క్రమంలో.. అప్పాపురం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, అదుపుతప్పి జారిపడ్డారు. ఈ ఘటనలో వీరిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి ఈఎంటీ ఈశ్వరరావు, పైలెట్ నారాయణరావులు ప్రథమ చికిత్స నిర్వహించి పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇంకా పోలీసులకు సమాచారం అందాల్సి ఉంది.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

భోగాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): అమటాంరాయవలస గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు రెండు లారీలు ఒకదాని వెనుక మరొకటి వెళ్తున్నాయి. రాయవలస సమీప జాతీయ రహదారిపైకి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని వెనుక లారీ ఢీకొంది. దీంతో వెనుక లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు సమాచారం అందలేదు.

20 మేకల మృతి

పార్వతీపురం రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బందులుప్పి గ్రామానికి చెందిన ఎస్.సింహాచలం, ఎస్.గోవింద్‌లకు చెందిన మేకలు ఆదివారం మృతి చెందాయి. సుమారు 20 మేకలు మృతిచెందగా.. మరో 30 మేకలు అస్వస్థతకు గురయ్యాయి. గ్రామ సమీపంలో ఉన్న నీలగిరి తోటలో ఎరువుల మందు తిని మేకలు మృతి చెందినట్టు సమాచారం. ఈ సమాచారాన్ని పశు వైద్యులకు అందిన వెంటనే గ్రామానికి చేరుకుని అస్వస్థతకు గురైన మేకలకు అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు

గరుగుబిల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా పొట్టేళ్ల పందెం నిర్వహిస్తున్న పందెంరాయుళ్లను అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం రావివలస గ్రామ పరిసరాల్లో నిర్వహించిన పొట్టేళ్ల పందెంపై దాడి చేశామని చెప్పారు. ఈ దాడిలో రెండు పొట్టేళ్లను, రూ.620 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నలుగురు పందెంరాయుళ్లపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా... తప్పిన ప్రమాదం

సీతంపేట రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో బొక్కిడుగూడ గ్రామ సమీపంలో ఆదివారం ఓ ఆటో బోల్తా పడింది. అయితే ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆటో డ్రైవర్ చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్ఐ వై.అమ్మనరావు తెలిపారు.

సారా స్వాధీనం

సీతంపేట రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులు నిర్వహించిన దాడుల్లో 20లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వై.అమ్మనరావు తెలిపారు. అలాగే ఏజెన్సీలోని కొండాడ గ్రామ సమీపంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 180 బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేశామని చెప్పారు.

బ్యాగు అపహరణ.. రూ.45వేలు మాయం

బెలగాం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): టిఫిన్ హోటల్‌లో మరిచిపోయిన బ్యాగు అపహరణకు గురైన ఘటన ఆదివారం పార్వతీపురం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాయగడకు చెందిన సైలాడ వరలక్ష్మి కుటుంబ సభ్యులు పెళ్లి నిమిత్తం వస్తువులు కొనడానికి వచ్చారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఒక హోటల్‌లో టిఫిన్ చేసి వారితో తెచ్చుకున్న బ్యాగును మరిచిపోయారు. హోటల్ నుంచి కొంతదూరం వెళ్లాక బ్యాగు కోసం మళ్లీ తిరిగి వచ్చి చూశారు. బ్యాగు అక్కడ లేకపోవడంతో పట్టణ పోలీసులు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా నిందితులను గుర్తించి, పోలీస్ స్టేషన్ పిలిపించారు. వారు బ్యాగును బాధితులకు ఇవ్వగా.. అందులో రూ.45వేలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న ఏఎస్ఐ కామేశ్వరరావు

గుర్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్ వద్ద గత కొన్ని సంవత్సరాలుగా ఒక వృద్ధుడు బిక్షాటన చేస్తూ జీవించేవాడు. ఆదివారం అదే జంక్షన్ వద్ద రోడ్డుపక్కన మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు.. ఆ మృతదేహానికి అంత్యక్రియలు చేయాలని స్టేషన్ ఏఎస్ఐగా పనిచేస్తున్న వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ బి.కామేశ్వరరావుకు సూచించారు. దీంతో కామేశ్వరరావు, మానవీయతా సేవా సంస్థ అధ్యక్షుడు గోవిందరాజులు, శ్వాస సేవా సంఘం అధ్యక్షులు బి.పైడినాయుడు, నారాయణమూర్తిల సహకారంతో అనాథ మృతదేహానికి అంత్రక్రియలు నిర్వహించారు. రవి, తాతారావు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం

కొత్తవలస, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ అప్పారావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు జగదీశ్వరి అన్నారు. కొత్తవలసలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక అయిన మాధవ్ నేతృత్వంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, లత్తిలి లశోక్ కుమార్, మాన్యం దేముడు, గోపి, టి.రాముడు, వీర్రాజు, రెల్లి అప్పారావు, విన్నకోట గణేష్‌పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

విజయనగరం క్రైం/దత్తిరాజేరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాల సాయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం తెలిపారు. ఆయన ఆదేశాలతో ఆదివారం పెదమానాపురం పోలీసు స్టేషన్ పరిధిలో గల సంత శివారులో డ్రోన్ సాయంతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 11 మందిని ఎస్ఐ ఆర్.జయంతి, డ్రోన్ పైలట్ వెంకటేష్, సిబ్బంది అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లోనూ, జాతరల్లోనూ డ్రోన్లు వినియోగించి నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించామన్నారు.

వేపాడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా రవికుమార్

వేపాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): వేపాడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా రవికుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ సామర్లకోటలో నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి వెళ్లారు. దీంతో డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న రవికుమార్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.

అబ్దుల్ కలాంకు నివాళి

గరివిడి, జూలై 27(ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలు వద్ద మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. జడ్పీటీసీ వాకాడ శ్రీను, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

- రాజాం రూరల్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని రాజాంలో మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

రాజాం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చాకలి వీధిలో ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. హెల్త్ సెక్రటరీ పి.గౌరీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముందుచూపు ముఖ్యం

(ఐదో పేజీ తరువాయి)

కాలేయాన్ని దెబ్బతీస్తుంది.

● **హెపటైటీస్-సీ:** ఇది కూడా రక్తమార్పిడి ద్వారా వ్యాపిస్తుంది. చాలా మందిలో లక్షణాలు బయటపడవు. నెమ్మదిగా లివర్‌పై ప్రభావం చూపి క్రానిక్‌గా మారి లివర్ సిరోసిస్, లివర్ క్యాన్సర్‌కు దారితీస్తుంది.

● **హెపటైటీస్-డీ:** హెపటైటీస్ బీ వున్న వారికి మాత్రమే ఇది వస్తుంది. హెపటైటీస్ బి లక్షణాలు మాదిరిగానే ఉంటాయి.

● **హెపటైటీస్-ఈ:** కలుషిత నీరు, ఆహారం ద్వారా వ్యాపిస్తుంది. ఇది ప్రమాదకరం కానప్పటికీ గర్భిణుల్లో బలహీన రోగ నిరోధక శక్తి కలవారిలో ప్రాణాంతకం కావచ్చు.

హెపటైటీస్- బీ, సీ వైరస్‌లతో ప్రమాదం..

హెపటైటీస్ బీ, సీ వైరస్‌లు ప్రమాదకరమైనవి. ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తాయి. ఈ తరహా వైరస్‌లు శరీరంలో ప్రవేశించినప్పుడు రోగ లక్షణాలు బయటపడవు కాని కాలేయాన్ని మాత్రం కుంగదీస్తాయి. ఇవి బాగా ముదిరితే లీవర్ సిరోసిస్ వంటి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. హఠాత్తుగా బరువు తగ్గడం, పచ్చ కామెర్లు, రక్తపు వాంతులు మొదలగు లక్షణాలు కన్పిస్తాయి. అటువంటి సమయంలో డీఎన్‌ఏ లేదా ఆర్‌ఎన్‌ఏ పరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్, సిటీ స్కానింగ్‌ల ద్వారా వ్యాధి తీవ్రత గుర్తించవచ్చు. హెపటైటీస్ బీ, సీ వల్ల లివర్ క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఉంది. లివర్‌లో అవాంచిత కణజాలం పేరుకుపోయి వాటికి చికిత్స జరగకపోతే అవి కణతులుగా మారిపోతాయి.

టీకాలతో హెపటైటీస్‌తో చెక్..

హెపటైటీస్ బీని నివారించడానికి ప్రభావంతమైన వ్యాక్సిన్ (టీకా) అందుబాటులో ఉంది. శిశువులు పుట్టిన వెంటనే హెపటైటీస్ బీ టీకా వేయడం చాలా ముఖ్యం. అలాగే పెద్దలు కూడా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. ముఖ్యంగా హెపటైటీస్ బీ వల్ల వచ్చే ప్రమాదం వున్నవారు హెపటైటీస్‌కు గురైన రోగి కుటుంబ సభ్యులు కూడా తప్పనిసరిగా వ్యాక్సిన్ వేసుకోవడం ఉత్తమం. ముందస్తుగా వ్యాక్సిన్ వేసుకుంటే, సంపూర్ణ రక్షణ లభిస్తుంది.

హెపటైటీస్ సీకి ఆధునిక చికిత్స..

ప్రమాదకర హైపటైటీస్-సీకి ప్రస్తుతం వ్యాక్సిన్ అందుబాటులో లేనప్పటికీ ఆధునిక సమర్థ చికిత్స నేడు అందుబాటులో ఉంది. హెపటైటీస్ ఉన్నట్టు అనుమానం కలిగితే వెంటనే పరీక్షలు చేయించుకుని వైద్యుని సలహా తీసుకోవడం ముఖ్యం. ముందస్తుగా గుర్తించడం, చికిత్స పొందడం వల్ల తీవ్రమైన కాలేయ సమస్యలను నివారించవచ్చు.



చికిత్స తప్పనిసరి..

హెపటైటీస్ బీ, సీలతో లివర్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. అలసట, నీరసం, వికారం, వాంతులు, పచ్చకామెర్లు వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు నిర్వహించుకోవాలి. ఎవరికైనా హెపటైటీస్‌పై సందేహాలు ఉంటే హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ పరీక్షల ద్వారా హెపటైటీస్ బీ, సీ వైరస్‌లు నిర్ధారణ అవుతాయి. ఒక వేళ పాజిటివ్ అయితే అశ్రద్ధ చేయకుండా వైద్యున్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. లేని పక్షంలో హెపటైటీస్ వైరస్ వల్ల వ్యాధి ముదిరి, ప్రాణాంతకం కావచ్చు.

-డాక్టరు ఐ.నరేష్‌కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజీస్ట్, విజయనగరం



హెపటైటీస్‌కు ఉచిత చికిత్స..

హెపటైటీస్ వైరస్‌ల పట్ల ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో ఏటా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. చాలా మందిలో ఈ సమస్య ఉన్నప్పటికీ తీవ్రత పెరిగేంత వరకూ వారికి తెలియడం లేదు. ఈ నేపథ్యంలో ముందస్తు స్క్రీనింగు పరీక్ష చేయంచుకోవడం అవసరం. హెపటైటీస్ బీ, సీ సోకిన రోగులకు ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స, ఔషధాలను ఇస్తున్నాం. బయట రూ.40 వేలు విలువ చేసే ఔషధాలను రోగులకు ఉచితంగా అందజేస్తున్నాం.

-డాక్టరు పి.పద్మలత, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజనాసుపత్రి

'రాజాం'కు ఎన్నికలు సాధ్యమేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఎన్నికలు జరిగే అవకాశమే లేదన్న ప్రచారం నడుస్తోంది. రాజాం లాంటి పట్టణ స్థానిక సంస్థలు పెండింగ్‌లో 21 ఉన్నాయి. మిగతా పాలకవర్గాల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 10తో ముగియనున్నాయి. అంటే కేవలం ఏడు నెలల వ్యవధి మాత్రమే ఉంది. అందుకే మిగతా మునిసిపాల్టీలతో కలిపి మాత్రమే రాజాం మునిసిపాల్టీకి ఎన్నికలు జరుగుతాయని ఎక్కువ మంది భావిస్తున్నారు. అప్పటివరకూ వేచి చూడక తప్పదంటున్నారు. అయితే ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా పోయాయి. రెండు విడతల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. పట్టణ జనాభాకు అనుసరించి ఈ నిధులు విడుదల అవుతుంటాయి. ప్రజల మౌలిక వసతులకు సంబంధించి పారిశుధ్యం, తాగునీరు వంటి వాటికి ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ పాలకవర్గం లేకపోవడంతో రాకుండా పోయాయి. దీంతో రాజాం మునిసిపాల్టీలో ఎక్కడివేసిన గొంగళి అక్కడ మాదిరిగా పరిస్థితి ఉండిపోయింది.

ఎటువంటి ఆదేశాలు లేవు..

రాజాం మునిసిపాల్టీకి సంబంధించి ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. కానీ ఆర్థిక సంఘం నిధుల దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న మునిసిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాల్టీలకు, నగర పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం 2026 మార్చి 10 వరకూ ఉంది.

-జె.రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం మునిసిపాల్టీ

కౌలు రైతులకు రుణాలేవి?

(ఐదో పేజీ తరువాయి)

జిల్లా అధికారులు నిర్దేశించారు. ఖరీఫ్ సీజన్ మొదలై రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ రూ.72 లక్షలే ఇచ్చినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రతి ఏడాది కార్డులు పొందిన వారిలో 10 శాతం రైతులకు మాత్రమే రుణాలు మంజూరు చేసి బ్యాంకర్లు చేతులు దులుపుకుంటున్నారు.

● కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలంటే ఎటువంటి హామీ పత్రాలు ఉండవు. ప్రభుత్వం మంజూరు చేసిన సీసీఆర్‌సీ మాత్రమే ఉంటుంది. రైతుల మీద నమ్మకం తప్పా వేరే మార్గం లేదు. సాధారణ రైతు అయితే పట్టాదారుని పాస్ పుస్తకంతోపాటు డిజిటల్ సిగ్నేచర్ ఉన్న 1బి తీసుకుని తన ఆధీనంలో ఉంచుకుని బాంకులు రుణాలు అందజేస్తాయి. కౌలు రైతుల విషయంలో అటువంటి హామీ లేకపోవడంతో రుణాలు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి సీసీఆర్‌సీ పొందిన రైతులందరికీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

వడివడిగా అడుగులు

(ఐదో పేజీ తరువాయి)

పరిష్కరించి వసతులు మెరుగుపరిస్తేనే మహిళల ఉచిత బస్సులో ప్రయాణంలో ఇబ్బందులు ఉండవు.

ఏర్పాట్లు చేస్తున్నాం..

మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. డిపోలు, రూట్లవారీగా బస్సుల వివరాలు ప్రభుత్వానికి అందించాం. ఈ నెలాఖరుకు పూర్తిస్థాయిలో మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయనుంది. తదనుగుణంగా చర్యలు చేపడతాం.

-జి.వరలక్ష్మి, జిల్లా ప్రజారవాణా అధికారి, విజయనగరం

కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు

● దేశ సంపదను దోచిపెడుతున్నారు ● పాలక పార్టీలకు అడ్డుకట్ట వేయాలి
● సీపీఐ జిల్లా మహాసభల్లో రెండో రోజు వక్తల పిలుపు

బొబ్బిలి జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేద రైతు, కార్మికుడు, ఆదివాసీలకు మనుగడ లేకుండా దేశ సంపదనంతటినీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రక్రియను పాలకులు నిరాటంకంగా సాగిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి అడ్డుకట్ట వేయాలన్నారు. సీపీఐ జిల్లా మహాసభల్లో భాగంగా ఆదివారం బొబ్బిలి ఓంకార్ థియేటర్‌లో ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మోదీ నాయకత్వాన్ని తుత్తునియలు చేయకపోతే మరిన్ని అరాచకాలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీల పేరుతో తెలుగుదేశం, జనసేన పార్టీలు బీజేపీని భుజానమోసుకుంటూ తొత్తులుగా మారిపోయాయని విమర్శించారు. వారి విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించి కూటమి పార్టీలకు ఎన్నికల్లో చేదు అనుభవాలు ఎదురయ్యేలా చేయాలని పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త మానవ సంబంధాలను బలపరుచుకొని చట్టసభల్లో గౌరవప్రదమైన స్థానాలను సీపీఐ దక్కించుకునేలా చేయాలని కోరారు. పేదల వాణిని సమర్థంగా వినిపించగల సత్తా ఒక్క సీపీఐకే సాధ్యమన్నారు. పేదల పేరుతో అమలు చేస్తున్న బియ్యం పథకం పక్కదారి పడుతోందని, 80 శాతం మేర బియ్యం నల్లబజారుకు తరలిపోతున్నాయని అన్నారు. ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరకు అందించాలని, ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్ను ధనాన్ని దుబారా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.కామేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నాయకులు కండాపు ప్రసాదరావు, బుగత అశోక్, అలమండ ఆనందరావు, మునకాల శ్రీనివాస్, కోట అప్పన్న, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బాయి రమణమ్మ, బుగత పావణి, నాగభూషణం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా రచనలు ఇంగ్లీషులోకి తర్జుమా కావాలి

● పేదరికంతో పోరాడుతూనే అమూల్యమైన రచనలు ● ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు



మాట్లాడుతున్న ప్రముఖ కవి, రచయిత గౌరునాయుడు

బొబ్బిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గుర్రం జాషువా రచనలు ఇంగ్లీషులోకి తర్జుమా కావాలని ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు ఆకాంక్షించారు. పేదరికం, కులవివక్షతో పోరాడుతూనే సామాజిక చైతన్యం కోసం అమూల్యమైన రచనలు చేసి పద్మభూషణ్, విశ్వకవి సామ్రాట్, మధుర శ్రీనాథ బిరుదులు పొందిన మహా వ్యక్తి జాషువా అని అన్నారు. అంబేద్కర్ సాహిత్య పీఠం వ్యవస్థాపకుడు సోరు సాంబయ్య అధ్యక్షతన ఆదివారం బొబ్బిలిలో నిర్వహించిన గుర్రం జాషువా 54వ వర్ధంతి సభలో గౌరునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాషువా అవమానాలు ఎదుర్కొన్న చోట ఎన్నెన్నో అమూల్యమైన సత్కారాలు అందుకున్నారని చెప్పారు. సాహిత్యానికి, కవిత్వానికి గల పటుత్వ మహిమ అది అని, ఆనాడు పేరొందిన కవులు జాషువాను చాలా అమానుషంగా అవమానించేవారని, అడుగడుగునా కించపరిచేవారన్నారు. ఆయన ఎక్కడా తొణకకుండా, బెణకకుండా ముందుకు సాగారని, తన రచనలతో కీర్తి శిఖరాలను అధిరోహించారని తెలిపారు. ప్రపంచమంతా గౌరవించదగ్గ కవి జాషువా అని అన్నారు. మరో రచయిత సాంబయ్య మాట్లాడుతూ అప్పటి పాలకులు నిమ్నజాతులను, పేద బడుగు వర్గాలను మరింతగా అణగదొక్కే కుతంత్రాలు పన్నగా వాటన్నిటికీ వీరోచితంగా ఎదరొడ్డి సమాజాన్ని మేలుకొలిపే ఎన్నో రచనలు చేసి సాహిత్య సంపదను మనందరికీ అందజేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత రౌతు రామ్మూర్తి మాట్లాడుతూ జాషువా ఓ చైతన్యదీప్తి అని కీర్తించారు. సమావేశంలో రిటైర్డ్ ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ, బొద్దాన అప్పారావు తదితరులు మాట్లాడారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు సాంబయ్య దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాలూరుకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త బలగ రాధ, ఎస్‌టీఓ తవిటయ్య, న్యాయవాది ఎస్‌జెవిల్సన్‌బా, కళాశాల లెక్చరర్ కౌలు చిరంజీవులు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలతో పిల్లలు, విజయమోహన్

మట్టి ప్రతిమలను పూజిద్దాం

బొబ్బిలి రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు విజయమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పెంట గ్రామంలో చిన్నారులకు మట్టి గణపతి విగ్రహాలపై అవగాహన కల్పించారు. మట్టి గణపతి ప్రతిమలను పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం అని నినదించారు. వనమిత్ర కృష్ణదాస్ మాట్లాడుతూ రానున్న వినాయక చవితికి ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

'కార్మిక చట్టాలను అమలు చేయాలి'

బాడంగి, జూలై 27(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దుచేసి కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారా యణ డిమాండ్ చేశారు. మండల సీఐటీయు మహాసభ స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగింది. సీఐటీయు కన్వీనర్ ఎ.సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లకు, కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నా యన్నారు. కార్మికులు పోరాటం చేసి సాధించు కున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్నా యన్నారు. 8 గంటల పనిని 10 గంటలు చేయాలని నిబంధనలు తీసుకురావడం చట్టవిరుద్ధమన్నారు. అనంతరం బాడంగి మండల సీఐటీయు కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎ.సురేష్, కోకన్వీనర్‌గా సీహెచ్.రమణమ్మ, శశికళ, కే.సింహాచలం, కమిటీ సభ్యులుగా సీత, శ్రీదేవి, నాగమణి, ఆదిలక్ష్మి, కళావతి, రామారావు, అప్పన్న, కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఉత్తరాంధ్ర నాయకులకు టీడీపీ పెద్దపీట

● ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు

బాడంగి, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఉత్తరాంధ్ర నాయకులకు పెద్దపీట వేస్తోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడు అన్నారు. ఆదివారం బాడంగి లో తెంటు బంగ్లా వద్ద విలేకరులతో మాట్లా డారు. టీడీపీ మొదటి నుంచి ఉత్తరాంధ్ర నాయకులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నాడు కింజరాపు ఎర్రన్నాయుడుకు కేంద్రమంత్రి పదవి ఇచ్చి సత్కరించిందని, ప్రతిభా భారతికి స్పీకర్ పదవితో గౌరవించిందన్నారు. నేడు అజాత శత్రువు, విద్యా సంస్థల ప్రదాత పూసపాటి అశోక్‌గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించి చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, టీడీపీ నాయకులు అల్లాడ భాస్కరరావు, వానిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు..

బొబ్బిలి రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాకుండా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. బంకురు వలస గ్రామంలో ఆదివారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది గేరు మారుస్తామని, సంక్షేమంతో పాటుగా అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తామని అన్నారు. కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, బొబ్బిలి మండల టీడీపీ అధ్యక్షులు వానిరెడ్డి సత్యనారాయణ, అల్లు కిషోర్, క్లస్టర్ ఇంచార్జ్‌లు, యూనిట్ ఇంచార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే బేబీనాయన, తెంటు

అశోక్‌కు పదవిపై హర్షం

బొబ్బిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ఉత్తరాంధ్ర నేతలకు సముచితమైన గౌరవం లభిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ట్రైబ్స్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యురాలు మోజూరు తేజోవతి అన్నారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. నీతికి మారుపేరుగా నిలిచే పూసపాటి అశోక్‌గజపతిరాజును గోవా గవర్నర్‌ను నియమించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. మేరు పర్వతం లాంటి అశోక్‌గజపతిరాజును వైసీపీ హయాంలో తీవ్ర అవమానాలకు, దూషణలకు గురిచేసిన సంగతిని ఆమె గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలంతా ఆనాడు ఎంతగానో నొచ్చుకున్నారని, ఇప్పుడు చంద్రబాబు చొరవతో గోవా రాజ్‌భవన్‌లో రాజలాంఛనాలతో అశోక్‌గజపతిరాజు అడుగుపెట్టారని, దీనికి వైసీపీ ఆనాడు చేసిన చేష్టలకు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అత్యంత కీలకంగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు.

గిరిజన గ్రామాల్లో వేంకటేశ్వర వ్రతాలు

సాలూరు/ రూరల్/పాచిపెంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. పాచిపెంట మండలం పనసలపాడులో సనాతన ధర్మపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సుబ్బ గురువు పర్యవేక్షణలో సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సామూహిక వేంకటేశ్వర వ్రతాన్ని జరిపించారు. కార్యక్రమంలో సనాతన ధర్మపరిషత్ అధ్యక్షుడు కోలకోటి శంకరరావు, రాజేష్,పువ్వలసరి గోపి,దుర్గప్రసాద్,ఏడు కొండలు,మాజీ జడ్పీటీసీ మంచాల పారమ్మ,ఇస్కాన్ ప్రతినిధి హరేకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూనంబందవలసలో: పాచిపెంట మండలం కూనంబందవలసలో సమరసత ఫౌండేషన్ ప్రతినిధి దూపం శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం నిర్వహించారు. పెద్దసంఖ్యలో గిరిజన మహిళలు ఈ వ్రతంలో పాల్గొని పూజలు చేశారు.



కొఠియా సమస్యపై కేంద్రానికి లేఖ

ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

సాలూరు రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలో ఉన్న కొఠియా గ్రూప్ గ్రామాలు ఏపీ, ఒడిశాల మధ్య వివాదంలో ఉండిపోయాయని, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కేంద్రప్రభుత్వానికి ఇటీవల లేఖ రాసినట్టు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు చెప్పారు. ఆయన ఆదివారం సాలూరు మండలం బాగువలస,పాలికవలసలో పర్యటించారు. పాలికవలసలో ఉపాధ్యాయుడు కోట బాలకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఈ రెండేళ్ల కాలంలో పలు గిరిజన సమస్యల పరిష్కారానికి చొరవ చూపామన్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి రోస్టర్ విధానాన్ని అమలుపై చొరవ చూపాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించామని, బీటెక్‌లో వివిధ బ్రాంచ్‌ల్లో డిగ్రీ పూర్తి చేసిన గిరిజన యువతకు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీతో రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. గిరిజన వర్సిటీలో గిరిజనులకు 7.5 శాతం సీట్లు కేటాయిస్తున్న నేపథ్యంలో ఈ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని కేంద్రప్రభుత్వాన్ని కోరామన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్: మంత్రి

సాలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు అండగా తోడ్పడుతోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం ఆమె మండలంలోని మరిపల్లి గ్రామానికి చెందిన వేమూరి నరేష్‌కు రూ.2 లక్షల 2 వేల 199ల చెక్కును అందచేశారు.



గంగయ్యకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తొలి మున్సిపల్ చైర్మన్ గంగయ్యకు నివాళి

బొబ్బిలి జూలై 27 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ తొలి చైర్మన్ దివంగత ఆరి గంగయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లో గంగయ్య విగ్రహానికి పలువురు ప్రముఖులు, సంఘాలనేతలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు చేసి బొబ్బిలికే గంగయ్య వన్నె తెచ్చారన్నారు. జిల్లా తెలగ సంక్షేమసంఘం అధ్యక్షుడు చనుమల్లు ప్రసాదరావు మాట్లాడుతూ ఆరి గంగయ్య తన వ్యక్తిత్వంతో రాష్ట్ర మున్సిపల్ చైర్మన్ల చాంబర్ అధ్యక్షుని హోదాకు ఎదిగారని అన్నారు. మున్సిపల్ కార్యాలయం ముందు గంగయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నందమూరి రమణమూర్తి, గంగయ్య అభిమానులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

బొబ్బిలి జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. సంస్థ వ్యవస్థాపకురాలు, ప్రపంచ మానవహక్కుల మండలి మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ చింతా శారద ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో నేత్రవైద్యురాలు డాక్టర్ దివ్య 174 మంది కంటి రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. వీరిలో 47 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించాలని గుర్తించారు. వీరందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయించి ఇంటికి పంపించనున్నట్లు డాక్టర్ శారద తెలిపారు.